www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

మంగళవారం | 10 | ఫిబ్రవరి | 2026

పేజీలు : 8

## ప్రజా ప్రభుత్వంలో పట్టణాల్లో ప్రశాంత వాతావరణం

- మీడియా సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క



2 లో

# ప్రచారానికి తెర..!

## -రేపే మున్సిపల్ పోలింగ్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ ఎన్నిక ప్రచారానికి తెరపడింది. గడిచిన వారం రోజులుగా బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తించారు. ర్యాలీలు, సభలు, సమావేశాలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం సోమవారం సాయంత్రం ఐదు గంటలకు బహిరంగ ప్రచారానికి తెరపడింది. ఖమ్మం జిల్లాలో వివిధ పార్టీల రాష్ట్ర నేతలు ప్రచారాన్ని నిర్వహించారు. సిపిఐ జాతీయ నేత నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, బాగం హేమంతరావు, దండి సురేష్ తదితరులు సిపిఐ అభ్యర్థుల గెలుపు ప్రచారానికి నేతృత్వం వహించారు. కాంగ్రెస్‌కు మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, డిసిసి అధ్యక్షులు సత్యనారాయణ తదితరులు నేతృత్వం వహించారు. బిఆర్ఎస్‌కు ఎంఎల్‌సి తాతా మధుసూదన్, మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు నేతృత్వం వహించగా సిపిఎంకు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు లు ప్రచార బాధ్యతలను నిర్వహించారు. బుధవారం ఖమ్మం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం కార్పోరేషన్, ఇల్లెందు, అశ్వారావుపేట మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఖమ్మంజిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో 117 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. సత్తుపల్లిలో 47 పోలింగ్ కేంద్రాలు, మధిరలో 44, వైరాలో 41, ఏదులాపురంలో 69, కల్లూరులో 40 మొత్తంగా 241 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

# ఓటు యమ 'కాస్ట్లీ' గురూ..!




**-బరువెక్కిన ఓటు**
**- రూ. ఐదువేల నుంచి పదివేలు పలుకుతున్న ఓటు**
**-పంపిణీ అంత బహిరంగ రహస్యమే**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఎన్నిక ఎన్నికకు ఓటు ధర పెరుగుతుంది. ఇప్పుడు ఓటు ధర కూడా బంగారం ధరలా దూసుకుపోతుంది. ఓటరు డబ్బులు తీసుకోకపోతే తప్ప పంపిణీ చేయని వారు లేరు ఆయా ప్రాంతాల పరిస్థితి, బరిలో నిలిచిన అభ్యర్థులను బట్టి ఓటు ధర ఉంటుంది. వైరా మున్సిపాలిటీలో ఓటు ధర ఒక వార్డులో పదివేలకు చేరుకుందట. ఒక అభ్యర్థి ఐదువేలు ఇస్తే మరో అభ్యర్థి ఓటుకు ఏడువేలు రూపాయలు పంపిణీ చేశాడట. ఇప్పుడు తిరిగి మొదటి అభ్యర్థి పంపిణీ మొదలుపెట్టగా ఇంకో అభ్యర్థి ఫైనల్ టచ్ ఇస్తానంటూ ప్రకటించడంతో ఇప్పుడు ఆ వార్డు పరిస్థితి రసాందకాయంలో పడగా ఓటర్లకు మాత్రం పంట పండింది. నలుగురు ఉన్న ఇంట్లో ఓ సాలు పంట వచ్చినట్లేనని వ్యాఖ్యానిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. ప్రతి చోట పంపిణీ జరుగుతూనే

మిగతా 2లో..

# ఇది అహంకారానికి.. ఆత్మీయతకు పోటీ












**- ప్రజా ఆశీర్వాదమే మా బలం**
**- కమ్యూనిస్టులే పేదలకు అండ**
**- మేయర్ పీఠం మనదే : కూనంనేని**

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** ఇది అహంకారానికి ఆత్మీయకు మధ్య జరుగుతున్న పోటీ అని, ఈ కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుని ఆత్మగౌరవాన్ని నిలుపుకుందామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్పోరేషన్ ఎన్నికల్లో భాగంగా సోమవారం రామవరంలోని ఆరు డివిజన్లు, బర్మాక్యాంపు, ప్యూన్స్ బస్తీ, ఏ పవర్ హౌస్ బస్తీ, గంగాబిషన్ బస్తీలో రోడ్ షోలు,కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఎర్రజెండాది ఏముందిలే, కమ్యూనిస్టుల అయిపోయింది అంటూ అవకాలు చెవాకులు పేలుతున్నవాళ్లు సిపిఐకి అందుతున్న ఆదరణను చూసి ఎందుకు హైరానా పడుతున్నారని అన్నారు. పాల్వంచ మొదలుకుని కొత్తగూడెం, సుజాతనగర్ వరకు ఉన్న కార్పోరేషన్ 60 డివిజన్లు ఎరుపు, పసుపు రంగుల జెండాలతో

మిగతా 2లో..

# ఉమ్మడి రాజకీయాల్లో సత్తుపల్లి ఒక బ్రాండ్

**-కాంగ్రెస్ హయాంలోనే సత్తుపల్లి అభివృద్ధి**
**-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

2లో..



# ప్రజల పక్షాన నిలిచే సిపిఐ అభ్యర్థులను గెలిపించండి

**-సిపిఐ అభ్యర్థుల గెలుపుతోనే సమస్యల పరిష్కారం**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు విజ్ఞప్తి చేశారు. ఖమ్మంజిల్లాలో నాలుగు మున్సిపాలిటీల పరిధిలో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసేవారిని గెలిపిస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. ఇప్పుడు ఎన్నికలంటే ప్రలోభాలే అన్న భావన రోజు రోజుకు బలపడిందని కానీ ఐదేండ్ల పాటు సేవలు అందించే వారిని ఎంపిక చేసుకోవాలని ఆయన కోరారు. కొందరు డబ్బులతో పదవులు పొందాలని చూస్తున్నారని డబ్బులతో గెలిచిన వారు ప్రజల గురించి పట్టించుకోరని ఎంత ఖర్చు చేశాం ఎంత లాభం తీసుకోవాలన్న ఆలోచనలోనే ఉంటారని ఆయన తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటులోనూ,

మిగతా 2లో..

# ఇది అహంకారానికి.. ఆత్మీయతకు పోటీ





(మొదటిపేజీ తరువాయి)

రెపరెపలాడుతున్నాయని చెప్పారు. కార్పోరేషన్ కాకుండా చాలా మంది కుట్రలు పన్నారని, కానీ వారి ప్రయత్నాలు పటాపంచలు చేస్తూ ప్రభుత్వంతో కొట్లాడి కార్పోరేషన్ ఏర్పాటు చేసుకున్నామని, తద్వారా ఈప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందనుందన్నారు. రాబోయేరోజుల్లో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, ప్రజల ఆర్థిక స్థితి గతుల్లో మార్పులు చోటు చేసుకుంటాయని, పారిశ్రామి, విద్యా,వైద్య రంగాలు మరింత అభివృద్ధి సాధిస్తాయని చెప్పారు. తాను ఎంఎల్ఏగా గెలిచిన నాటి నుండి పెద్ద ఎత్తున నిధులు సమీకరించి నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధిని కొనసాగిస్తున్నామని చెప్పారు. మారుమూలు ప్రాంతాల్లో సైతం మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎర్త్ యూనివర్సిటీ తీసుకొచ్చామని, ఈ యూనివర్సిటీలో చదువుకునేందుకు దేశ విదేశాల నుండి విద్యార్థులు శాస్త్రవేత్తలు తరలి రాబోతున్నారని అన్నారు. సింగరేణి సౌజన్యంతో బస్టాండ్ ఏరియా రోడ్ల వెడల్పుతో పాటు నూతన బస్టాండ్ నిర్మాణానికి నిధులు తీసుకొస్తున్నామని చెప్పారు. సింగరేణి కార్మికుల సంక్షేమానికి అనేక పోరాటాలు చేసి కార్మికుల శ్రేయస్సుకు ఎర్రజెండా పాటు పడుతుందని తెలిపారు. పేదలు,బడుగు, బలహీన వర్గాల కోసం కార్మికులు, కర్షకులు చేతివృత్తిదారుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి స్వార్థం లేకుండా కేవలం అభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పేదలకు అండగా ఉండేది ఎర్రజెండానే అని, ఈవందేళ్ల కాలంలో ఇది నిరూపితమైందని తెలిపారు. ప్రజా ఆశీర్వాదమే మనకు బలమని, కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి సిపిఐ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా సురపరిపాలనను స్వాగతిస్తున్నట్లు అవుతుందని అన్నారు. కార్పోరేషన్ వ్యాప్తంగా చక్కటి ఫలితాలు రానున్నాయని, మేయర్ పీఠం మనదే అని చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, కందుల భాస్కర్, ఎస్కే ఫహీమ్, వాసిరెడ్డి మురళీ, దుర్గరాశి వెంకన్న, మునిగడప వెంకటేశ్వర్లు, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, జక్కుల గట్టయ్య, క్రిష్టాఫర్, జహీర్, ఖయ్యూమ్, గోపి కృష్ణ, గుత్తుల సత్యనారాయణ, గుత్తుల శ్రీనివాస్, లావుడ్య వినాయక్, భూక్యా ధ్రస్తు, జక్కుల రాములు, కొమారి హన్మంతరావు, గెద్దాడు నగేష్, వంగ వెంకట్, రమణమూర్తి, సందెబోయిన శ్రీనివాస్, మునిగడప పద్మ, భూక్య శ్రీనివాస్, ఎర్రవెల్లి శంకర్, కనుకుంట్ల సాహితి, పి ఇందిరా ప్రియదర్శిని, పోలమూరి ధనలక్ష్మి , బానోత్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో పట్టణాల్లో ప్రశాంత వాతావరణం

**ప్రజాపక్షం/మధిర :** రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు ఒడిఒడిగా ముందుకు సాగడానికి, సంక్షేమ ఫలాలు అన్ని వర్గాలకు చేరడానికి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లల్లో ఎన్నికలు జరుగుతున్నాయని కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సోమవారం మధిర పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపల్, విద్యా రెండు శాఖలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఉన్నాయి వారు ఈ రెండు శాఖలపై ప్రత్యేకంగా దృష్టి సారించి ముందుకు తీసుకు వెళ్తున్నారని తెలిపారు. మురుగునీటిని శుద్ధి చేసేందుకు రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఎస్టీపిలు మంజూరు చేశామని, పట్టణాల్లో ఆసుపత్రులు, విద్యావ్యవస్థ, ఎలక్ట్రిసిటీ ఈ రంగాల్లో ప్రపంచంలో వస్తున్న పరిణామాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ప్రతినెల 15వ తేదీన తర్వాతే వచ్చేవి కాని మేము అధికారంలోకి రాగానే ప్రతి నెల మొదటి తేదీనే ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జీతాలు జమ చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మా ప్రభుత్వం కృషి చేస్తుందని, ఉద్యోగుల సంక్షేమం కోసం కోటి రూపాయల ప్రమాదబీమా కార్యక్రమాన్ని అమలు చేయబోతున్నామని, ఉద్యోగుల సంక్షేమం కోసం ఉద్యోగ వర్గాలు కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. 2024 విజన్ డాక్యుమెంట్‌ను ఇటీవల గ్లోబల్ సమ్మెట్‌లో విడుదల చేశామని, మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దామని, ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తెలంగాణ రాష్ట్రం చేరుకుందని తెలిపారు. రాష్ట్రాన్ని పది సంవత్సరాలు పరిపాలించిన బిఆర్ఎస్ వారు పట్టణాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులు, మహిళలు అన్ని రంగాలను గాలికి వదిలేశారని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలు పెంచాలన్న ఆలోచనలను గత ప్రభుత్వం చేయలేదని అన్నారు. అటువంటి వారికి ఓట్లు వేస్తే సన్న బియ్యం పోయి తిరిగి మొద్దు బియ్యం వస్తాయి, ఆర్టిసి బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం ఉండదు, ఉద్యోగుల జీతాలు ప్రతినెలా 15వ తేదీన తర్వాతే పడుతాయన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ నగరాలు, పట్టణాలన్నింటిలో సాధ్యమైనంత వరకు మౌలిక సదుపాయలు, మెరుగైన వసతులు కల్పిస్తూ ముందుకు పోతుందని తెలిపారు. అర్హత కలిగిన పేద బడుగు బలహీన వర్గాల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఇచ్చామని అన్నారు. మన బిడ్డలకు ఉద్యోగాలు రావాలంటే స్కిల్స్ ఉన్న కోర్సులు నేర్పించాలి అందుకే రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఐటిఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దుతున్నామని, ఇవన్నీ కార్పొరేషన్లు, మున్సిపల్ కేంద్రాల్లోనే ఉన్నాయని తెలిపారు. రాబోయే 50 సంవత్సరాలకు మధిర పట్టణ అవరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు ప్రణాళికబద్ధంగా చేపడుతున్నట్లు డిప్యూటీ సిఎం వివరించారు. వరద నీరు మధిర పట్టణంలోకి రాకుండా భారీ రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నామని, వైరా నదిని టూరిజం ప్రాజెక్టుగా అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్కులు, ఫుడ్ కోర్ట్ వంటివి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆధునిక స్మశాన వాటిక, మురుగునీరు కనబడకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజి, భారీ వర్షాలు వరదలు వచ్చినప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మధిర పట్టణానికి ప్రవేశించే మార్గాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేందుకు పార్కులు నిర్మిస్తున్నామని తెలిపారు. మై మధిర క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మిర్యాల రమణగుప్తా, రాష్ట్ర నాయకులు కొండబాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా సమ్మెను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/మణుగూరు:** కొండాపురం కేసిహెచ్‌పి లో జేఏసీ నాయకులు పి. వీరభద్రం అధ్యక్షతన సోమవారం ఫిట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు పాల్గొని ఈనెల 12వ తారీకు జరుగు ఆల్ ఇండియా సమ్మెను ను జయప్రదం చేయాలని, పబ్లిక్ రంగ సంస్థలను కాపాడాలంటే ఈ సమ్మెను విజయవంతం చేయాలని, 44 చట్టాలు రద్దుచేసిన నాలుగు కోడ్‌లుగా ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి వచ్చేలాగా సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలగపల్లి జాన్, ఐఎన్‌టిసి మధుసూదన్ రెడ్డి, టీయూసీ వెంకటేశ్వరరావు, ఏఐటియుసి శ్రీను, ప్రసాద్ నాయకులు పాల్గొన్నారు.



# ఓటు యమ 'కాస్ట్లీ' గురూ..!

(మొదటిపేజీ తరువాయి)

ఉంది. కొన్ని చోట్ల ఓటుకు రెండు వేల చొప్పున పంపిణీ చేస్తే మరికొన్ని చోట్ల మూడువేల చొప్పున పంపిణీ చేస్తున్నారు. ఆ తర్వాత ప్యాకేజీలు కూడా ఇచ్చే అవకాశం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతుంది. మొత్తంగా మున్సిపల్ ఎన్నికల్లో విచ్చలవిడి ఖర్చు ఇక సామాన్యులను పోటీకి దూరం చేస్తుంది. జనరల్, రిజర్వేషన్ అనే తేడా లేకుండా ఇష్టానుసారంగా డబ్బులు పంపిణీ చేస్తున్నారు. నామినేషన్ వేసిన నాటి నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు ఇదే పరిస్థితి.

**పంపిణీ బహిరంగ రహస్యమే :**

అప్పుడప్పుడు అధికారుల ప్రకటనలు నవ్వు తెప్పిస్తుంటాయి. ఎన్నికల అధికారులతో పాటు పోలీస్ అధికారులు కూడా ప్రలోభాలకు గురిచేస్తే ఇబ్బందులు తప్పవు కఠినంగా శిక్షిస్తామంటూ చేసే ప్రకటలను చూసి ఎన్నికల బరిలో నిలిచిన వారు అవునా అంటూ వ్యాఖ్యానించడం అలవాటుగా మారింది. ప్రస్తుతం మున్సిపల్ ఎలక్షన్లు జరుగుతున్న పలు వార్డుల్లో యథేచ్ఛగా పంపిణీ జరుగుతుంది. ఎక్కడో చాటు మాటుగా జరిగే పంపిణీ వ్యవహారం ఇప్పుడు యథేచ్ఛగా జరుగుతుంది. పట్టపగలు డబ్బుల సంచులతో ఇంటింటికి తిరిగి డబ్బులు పంపిణీ చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రత్యర్థి పార్టీలు కలిసే డబ్బులు పంపిణీ చేయడం గమనార్హం. ఎన్నికల్లో ప్రలోభ పర్వం చట్టబద్ధమైందా అన్న భావన కూడా కలుగుతుంది. మొత్తంగా ఎన్నికలంటే అమ్మకం, కొనుగోళ్లు అనే వ్యవహారంగా మారిపోయింది. ఎవరు ఎక్కువ పెట్టి కొనుగోలు చేయగలిగితే వారికి అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి.

# ప్రజల పక్షాన నిలిచే సిపిఐ అభ్యర్థులను గెలిపించండి

(మొదటిపేజీ తరువాయి)

ఆ ప్రాంతా అభివృద్ధిలోనూ సిపిఐ కీలక భూమిక పోషించిందన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పాఠశాలలు, ఇతర ప్రభుత్వ సంస్థల ఏర్పాటు సిపిఐ హయాంలోనే జరిగిందని హేమంతరావు స్పష్టం చేశారు. పలు గ్రామాలు అనే దశాబ్దాల పాటు సిపిఐని ఆదరించాయని ఇప్పుడు కూడా సిపిఐ బలపర్చిన అభ్యర్థులను కౌన్సిలర్లుగా గెలిపించాలన్నారు. మధిర మున్సిపాలిటీలో మడుపల్లి గ్రామాన్ని అభివృద్ధి పదంలో నడిపిన చరిత్ర సిపిఐకి మాత్రమే ఉందన్నారు. అనేక దశాబ్దాల పాటు మడుపల్లి గ్రామ పంచాయతీ సిపిఐ ఏలుబడిలో ఉందని ఇప్పుడు ప్రజలు అనుభవిస్తున్న అనేక అభివృద్ధి కార్యక్రమాల వెనక సిపిఐ కృషి దాగి ఉందని ఆయన తెలిపారు. మడుపల్లి పరిధిలోని ఏడవ వార్డులో సిపిఐ బలపర్చిన ఊట్ల కొండలరావు ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. వైరా మున్సిపాలిటీ 15వ వార్డులో సిపిఐ, బిఆర్ఎస్, సిపిఎం బలపర్చిన అభ్యర్థిగా నల్లమోతు శైలజ పోటీ చేస్తున్నారని ఆమెను గెలిపించాలని హేమంతరావు కోరారు. దిద్దుపూడి గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు సిపిఐ సర్పంచ్ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని ఆయన తెలిపారు. మున్సిపల్ ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి అభివృద్ధికాముకులను గెలిపించాలని ఆయన కోరారు.

# ఉమ్మడి రాజకీయాల్లో సత్తుపల్లి ఒక బ్రాండ్

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గానికి ఒక ఘన కీర్తి ఉందని, ఉమ్మడి రాజకీయాల్లో సత్తుపల్లి కి ఒక బ్రాండ్ ఉందని ఆ బ్రాండ్ చెరిగిపోకూడదు అంటే కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించాలని సూచించారు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. సోమవారం సత్తుపల్లి రింగ్ రోడ్ లో నిర్వహించిన ఎన్నికల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి అభివృద్ధి కాంగ్రెస్ హయాంలో నే సాధ్యపడిందన్నారు. ఇక్కడి ప్రజలు చాలా తెలివి గల వాళ్లని, అభివృద్ధి వైపే ఉంటారని, మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించుకుంటారని జోష్యం చెప్పారు. మున్సిపాలిటీ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యపడుతుందన్నారు.. తొలకరిలోగా సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు సత్తుపల్లికి తెస్తానన్నారు. రైల్వే లైన్, విమానాశ్రయం, యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. వచ్చేనెలలో ఫుడ్ పార్క్ సేవలు ప్రారంభమవుతున్నాయన్నారు. రాష్ట్ర ఖజానాలో ఆర్థిక బాధలు ఉన్నప్పటికీ అభివృద్ధి ఎక్కడా ఆగడం లేదన్నారు.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ. 22 వేల కోట్లు మంజూరు చేశామని, రూ. 21 వేల కోట్ల రైతు రుణమాఫీ చేశామని, రైతు బంధు, రైతు బీమా కోసం తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాకు జమ చేశామని, మూడు వేల కోట్లతో సన్న బియ్యం పథకం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతు బోనస్ కింద పదివేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజులు ఇంకా చాలా పథకాలు ప్రజలకు అందాల్సి ఉందని, వేరే ఆలోచన లేకుండా కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించుకోమని కోరారు. మున్సిపాలిటీ పీఠం కాంగ్రెస్ కు వస్తేనే అభివృద్ధి సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే రాగమయి, రాష్ట్ర నాయకుడు దయానంద్ లు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో కాగితాలకి అభివృద్ధి పరిమితమైందని ఆచరణలో కనిపించలేదన్నారు. అభివృద్ధి మరింత ముందుకు పోవాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను 23 వార్డులలో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 23 వార్డుల కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శివాలయానికి హద్దులు గుర్తించాలి

**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామ పంచాయితీ లింగం బంజరలో గల పురాతన శివాలయానికి సంబంధించిన స్థలానికి హద్దులు గుర్తించాలని కోరుతూ లింగం బంజర గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో మండల తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అధికారిక రికార్డుల ప్రకారం శివాలయానికి 3.80 ఎకరాల భూమి ఉన్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతం శివాలయం 10 గుంటలలోనే ఉందని మిగతా స్థలానికి సర్వే నిర్వహించి హద్దులు నిర్వహించాలని అధికారులను కోరారు. విశ్వనాథపల్లి రెవిన్యూలో గల సర్వే నెంబర్ 362/10లోని 11.33 ఎకరాలలో శివాలయం భూమి ఉందని చెప్పారు. కాబట్టి అధికారులు త్వరితగతిన సర్వే చేసి శివాలయ భూమికి హద్దులు గుర్తించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో లింగం బంజర గ్రామస్తులు పురం అంజయ్య, బడుగుల శ్రీను, మొగిలిచర్ల రాంబాబు, పురం రామరాజు, తదితరులు ఉన్నారు



# ఆర్థిక అంశాలలో అప్రమత్తంగా ఉండాలి



**-సైబర్ మోసాల పట్ల విస్తృత ప్రచారం కల్పించాలి**
**-గోడప్రతులను ఆవిష్కరించిన కలెక్టర్**

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఆర్థిక అంశాలలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆర్థిక అక్షరాస్యతపై రూపొందించిన గోడ ప్రతులను అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పౌరుడికి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాల గురించి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తెలుసుకుని జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రస్తుతం మనం అధికంగా ఫోన్ ద్వారా లావాదేవీలు చేస్తున్నామని, సైబర్ నేరగాళ్లు మన ఫోన్ నుంచి సమాచారం సేకరించి బ్యాంకులో ఉన్న డబ్బును దోచే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ప్రముఖ వైద్యులు, వ్యాపారవేత్తలు కూడా సైబర్ మోసాలకు గురయ్యారన్నారు. మన ఫోన్ పాస్‌వర్డ్ ఆరు నెలలకు ఒకసారి మారుస్తూ ఉండాలని, ముఖ్యమైన ఖాతాలకు తప్పనిసరిగా రెండు ఫ్యాక్టర్ అతెంటికేషన్ పెట్టాలని, కెవైసి వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఎస్ఎంఎస్‌లో వచ్చే ఫ్రాడ్ లింక్‌లను మనం క్లిక్ చేయవద్దని, ఫోన్ కాల్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటిపి, ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు ఎవరికి ఇవ్వవద్దన్నారు. వాట్సాప్ ద్వారా కలెక్టర్ ఉన్నతాధికారుల పేర్ల మీద మెసెజ్ చేస్తూ డబ్బులు అడుగుతూ మోసం చేస్తున్నారని, మనం ఒకరికి డబ్బులు పంపే ముందు ఒకటికి రెండు సార్లు ధృవీకరించుకోవాలన్నారు. ఫోన్‌లో అడ్డమైన యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని, యాప్‌లకు అనుమతులు ఇచ్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మన కుటుంబానికి ఎటువంటి బీమా తీసుకోవాలి, మనం పెట్టుబడులు పెట్టే సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి వంటి అంశాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. మన ఇంటిలో ఉన్న వృద్ధులను కూడా సైబర్ నేరాల పట్ల జాగృతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, ఎల్‌డిఎం ఎ. రవిప్రసాద్, టిజిబి రీజినల్ మేనేజర్ ఎ. ప్రసన్నకుమార్, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ శ్రీరామ్ బరన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్‌పి కాలువ నీరు వెంటనే విడుదల చేయాలి

**పల్లిపాడువద్ద రహదారిపై బైఠాయించిన రైతులు**



ప్రజాపక్షం/కొణిజర్ల : సాగుచేసిన మొక్కజొన్న పంట చేతికొచ్చే దశకు సాగర్ నీళ్లు రాక పంట ఎండిపోయే దశకు వచ్చిందని వెంటనే సాగర్ నీళ్లు విడుదల చేయాలని కోరుతూ మండల పరిధిలోని గుబ్బగుర్తి, రాంపురం, అంజనాపురం పలు గ్రామాలకు చెందిన రైతులు సోమవారం పల్లిపాడునుంచి ఏన్కూరు వెళ్లే రహదారిపై బైఠాయించి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతు వేల రూపాయలు ఖర్చుపెట్టి వేసిన మొక్కజొన్న పంట చేతికొచ్చే సమయానికి సాగర్‌నీళ్లు నిలిపివేయడంతో మొక్కజొన్న పంట ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని దీనివలన రైతులు తీవ్ర నష్టానికి గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. పదిరోజులుగా సాగర్‌నీరు రాకపోవడంతో సాగుచేసిన పంట కళ్లముందే ఎండిపో తుందని అన్నారు. అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ప్రతిసంవత్సరం అతివృష్టి అనావృష్టివలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఈసంవత్సరం మొక్కజొన్న పంటను ఎక్కువమొత్తంలో సాగుచేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సాగర్‌నీరు విడుదల చేసి రైతులను కాపాడాలని పేర్కొన్నారు.

# 12న దేశ వ్యాప్త సమ్మె



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఈ నెల 21న జరగనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, కార్మిక లోకానికి ఏఐటియూసీ జాతీయ సమితి సభ్యులు బి.జి క్లెమెంట్ పిలుపునిచ్చారు. సోమవారం ఏదులాపురంమున్సిపాలిటీ పరిధిలో కార్మికులు, ఎస్‌డబ్ల్యుసి, ఎన్టీఆర్ హమాలీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడులను రద్దు చేయాలని, చూస్తుందన్నారు. విద్యుత్తు సవరణ చట్టం2025, విబీజీరామ్‌జి చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసిలో 100శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించడం లాంటి ప్రమాదకరమైన నిర్ణయాలను వ్యతిరేకించాలని కోరారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడంలో కార్మిక సంఘాల పోరాటాలు ఎనలేనివన్నారు. కావున కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి తమ సత్తాను చాటాలన్నారు. అనంతరం సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా అధ్యక్షకార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు, హమాలీ నాయకులు కొదమూరు బిక్షం, గరిడేపల్లి వెంకన్న, ఏ. సైదులు, సిహెచ్ సీతారాములు, సిండికేట్ హమాలీ నాయకులు నూకల శ్రీను, రవీందర్‌రెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నకిరేకంటి కృష్ణ, గట్టి గుండె బాబురావు, ముత్తయ్య, బల్లి ఉపేంద్ర, బుద్ధి విజయ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**-ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన కలెక్టర్**



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కూసుమంచి మండలం మల్లేపల్లి సర్పంచ్ భవిత గ్రామంలో ప్రజల నివాసాలకు దగ్గరలో హాని కలిగించేవిధంగా బాయిలర్ రైస్ మిల్లులను ఏర్పాటు చేస్తున్నారని దీనిని నిలిపివేయాలని దరఖాస్తు చేశారు. అదే గ్రామానికి చెందిన శంకర్ నకిలీ కలుపు మందు వల్ల పంట నష్టం వచ్చిందని అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం అర్బన్ మండలం 14వ డివిజన్‌కు చెందిన మహ్మద్ మహబూబ్‌అలీ వెలుగుమట్ల సర్వే నెంబర్ 95లో అక్రమించిన భూమిని దానికి సంబంధించిన పొందిన నకిలీ పట్టాపై దర్యాప్తు చేసి రద్దు చేయాలని కోరారు. ఖమ్మం నగరంలోని శ్రీరాంనగర్‌కు చెందిన కె. చక్రపాణి తనకు 2016 నుంచి 2019 వరకు దివ్యాంగుల పెన్షన్ వచ్చిందని ఆగిపోయిన దివ్యాంగుల పెన్షన్‌ను మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ అభ్యర్థులను గెలిపించండి



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో గత ఐదు సంవత్సరాలుగా నివాస ముంటున్న పేదల ఇళ్లను కూల్చిన కాంగ్రెస్‌ను మున్సిపాలిటీ ఎన్నికల్లో ఓడించాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం అన్నారు. ప్రభుత్వ భూమిలో సుమారు 200 కుటుంబాలు పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు గుడిసెలు నిర్మించుకుని జీవనం కొనసాగిస్తున్న తరుణంలో స్థానిక ఎమ్మెల్యే గెలిచిన తర్వాత పట్టాలు, మౌలిక సదుపాయాలు కల్పిస్తానని మాట ఇచ్చి గెలిచిన తర్వాత మాట తప్పి ఆ పేదల ఇళ్లను కూల్చిన ఘనత కాంగ్రెస్ నాయకులు దక్కుతుందన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పలు వార్డుల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో 21 వార్డుల్లో పోటీచేస్తున్న టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు సిపిఐ మద్దతు ఉంటుందని, సిపిఐ శ్రేణులు ఏకమై కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించి 22 వార్డుల్లో బిఆర్ఎస్, సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని ఆయన అన్నారు. అదేవిధంగా 13వ వార్డులో పోటీ చేస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థి స్వరూప రాణిని, 19వార్డులో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి తిర్నాటి సంజయ్‌ను అఖండ మెజార్టీతో ప్రజలు గెలిపించాలని కోరారు. మున్సిపాల్టీలో ప్రశ్నించే గొంతుకను గెలిపించి ప్రజల తరఫున ప్రశ్నించే పోరాడే అవకాశం కల్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు స్థలాల్లో అండర్ డ్రైనేజీ పైపులైన్ నిర్మించవద్దు

**-స్థానికులు, రైతులు అభ్యంతరం**



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి సంబంధించి పైపులైన్లు ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటు చేయవద్దంటూ స్థానికులు, రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఖమ్మం నగరంలో మురుగునీటి తరలింపుకు సంబంధించి లకారం చెరువు ప్రాంతం నుంచి ధంసలాపురం పెద్ద చెరువు వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. డ్రైనేజీ నిర్మాణ పనుల్లో భాగంగా లకారం చెరువు వద్ద నుంచి కొత్తగూడెం, అల్లిపురం రోడ్డులోని గంగమ్మ గుడి వరకు ప్రస్తుతం ఉన్న వరద కాలువ పక్క నుంచి పైపులైన్‌లు ఏర్పాటు చేశారు. గంగమ్మ గుడి వద్ద నుంచి పైపులైన్ నిర్మాణాన్ని వాగు పక్క నుంచి కాకుండా దారి మళ్లించి 500 మీటర్ల ప్రైవేటు స్థలాల్లో నుంచి పైపులైన్ నిర్మాణం చేపట్టేందుకు అధికారులు పరిశీలన చేపట్టారు. ఇట్టి విషయం తెలుసుకున్న 15వ డివిజన్ కొత్తగూడెం వాసులు, రైతులు పైపులైన్ నిర్మాణ పనులపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గంగమ్మ గుడి వరకు ఏవిధంగా పైపులైన్ వేశారో అదేవిధంగా గంగమ్మ గుడి వద్ద నుంచి ధంసలాపురం చెరువు వద్ద ఏర్పాటు చేస్తున్న మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టిపి) వరకు వరద కాలువ పక్క నుంచే పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. డ్రైనేజీ నిర్మాణ పనులకు పరిశీలనకు వచ్చిన పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్ కుమార్, డిఈ నవ్యజ్యోతి, ఏసిపి వసుంధర తో రైతులు, స్థానికులు మాట్లాడారు. వరద నీటి కాలువ నుంచే పైపులైన్ ఏర్పాటు చేయాలని ప్రైవేటు స్థలాల్లో పైపులైన్ నిర్మించవద్దని అభ్యంతరం వ్యక్తం చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. దీనికి సంబంధించి ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించినట్లు స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, స్థానికులు బుగ్గవీటి సరళ, ఎర్రబోయిన గోవిందరావు, చేతుల నాగేశ్వరరావు, మొర్రిమేకల కోటయ్య, సత్తి గోపాలరావు, మొర్రిమేకల వెంకటనారాయణ, చిన్నవెంకటయ్య, లక్ష్మ య్య, శంకర్‌రావు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బహుమతుల ప్రదానం




ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మండల పరిధిలోని వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో గత నెల గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఇఓ మురళీమోహన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎరమల శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు వంశీరెడ్డి పుట్టిన సందర్భంగా రూ.12వేలు విలువ చేసే క్రీడా బహుమతులు, అదేవిధంగా పాఠశాలలో 4,5 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్టుల్లో మొదటి,రెండవ, మూడవ స్థానాలు పొందిన విద్యార్థులకు కూడెల్లి నాగేశ్వరరావు రూ.2వేలు విలువ చేసే ప్రోత్సాహక బహుమతులు అందించారు. అలాగే ఎరమల బ్రహ్మారెడ్డి పాఠశాలలో పనిచేస్తున్న విద్యా వాలంటీర్‌కు రెండు నెలల జీతంగా రూ.10వేలు, పాఠశాలకు రూ.6వేలు విలువ చేసే కుర్చీలను అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, కర్నాటి సుధాకర్‌రెడ్డి, ఎరమల వెంకట్రామిరెడ్డి, వెన్నపూస కృష్ణారెడ్డి, బగ్గుర శ్రీనివాస్‌రెడ్డి, నిర్మల, శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎం, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/చింతకాని : యూనియన్ బ్యాంకు అందిస్తున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు సీజీఎం జోనల్ హెడ్ రవీంద్ర బాబు సూచించారు. మండల పరిధిలోని బస్వాపురం యూనియన్ బ్యాంకు సేవలను నూతన భవనంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలన్నారు. యూనియన్ బ్యాంకులో రైతులు, విద్యార్థులు, మహిళా సంఘాలకు , సీనియర్ సిటిజన్‌లకు అందిస్తున్న పలు రకాల సేవలను ఆయన వివరించారు. ప్రతి ఒక్కరూ నగదు రహిత లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాంకు పరిధిలో అందించే పథకాలను ఖాతాదారులందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం హనుమంత్‌రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ రాయల దయాకర్, అసిస్టెంట్ మేనేజర్ శివకుమార్, బస్వాపురం, వందనం, రామకృష్ణాపురం, జగన్నాధపురం సర్పంచ్‌లు ఆవుల నర్సింహారావు, ఆవుల నాగేశ్వరరావు, గాదె నాగలక్ష్మీ, తాళ్ళూరి స్వప్న , బస్వాపురం ఉపసర్పంచ్ చంద్రకాని నర్సింహారావు, గ్రామ పెద్దలు, ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## పాత పేరుతోనే ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం చట్టానికి తూట్లు పొడిచే విధంగా ప్రయత్నం చేస్తుందని, ఉపాధి హామీ పథకంలో ఎటువంటి మార్పులు లేకుండా పాత పేరుతోనే కొనసాగించాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌కి ఫిబ్రవరి 12వతేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో ఉపాధి కార్మికులు పాల్గొనటానికి పనికి సెలవు ప్రకటించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ కార్మిక వర్గాలకు తీవ్ర నష్టం చేకూర్చే నాలుగులేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న యూరియా పంపిణీలో ఫెర్టిలైజర్ యాప్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 12న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్నిరంగాల్లో పనిచేస్తున్న కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం మండల అధ్యక్షులు గామాసు జోగయ్య, మండల వృత్తిసంఘం నాయకులు నాగులవంచ వెంకటరామయ్య, రైతు సంఘం నాయకులు ఆంగోతు వెంకటేశ్వర్లు, మేడగాని తిరుపతిరావు, డివైఎఫ్ఐ నాయకులు దివ్వెల వీరాంజనేయులు, వేముల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌కు గురై కేబుల్ ఆపరేటర్ మృతి



ప్రజాపక్షం/కారేపల్లి: మండల కేంద్రానికి చెందిన కేబుల్ ఆపరేటర్ మృతి చెందిన సంఘటన సోమవారం మధ్యాహ్నం ఇల్లందులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కారేపల్లి రజక బజారుకు చెందిన జూపల్లి లాలయ్య(41)ఇల్లందు మండలంలో కేబుల్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఇల్లందు కరెంటు ఆఫీస్ సమీపంలో ఖమ్మం ప్రధాన రహదారి పక్కన డిష్ కేబుల్ విద్యుత్ స్తంభాలపై నుండి లాగే క్రమంలో కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు లాలయ్యకు భార్య, నలుగురు కుమారైలు, ఓ కుమారుడు ఉన్నారు. సంఘటన స్థలాన్ని ఇల్లందు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

## మృతుని కుటుంబానికి బియ్యం వితరణ



ప్రజాపక్షం/రఘునాథపాలెం : మృతుని కుటుంబానికి బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్లు 50 కేజీల బియ్యాన్ని వితరణ చేశారు. గ్రామానికి చెందిన జమ్మిశెట్టి రుచిత ఇటీవల మృతి చెందారు. ఆ కుటుం బాన్ని గుత్తా వెంకటేశ్వర్లు సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గుండ్ల ముత్తయ్య, దేశగాని నర్సయ్య, దంతాల వెంకటేష్, మాజీ వార్డు సభ్యులు గంగిరెడ్డి విజయ్‌రెడ్డి, కాళంగి వీరబాబు, మద్దుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడివోకు సమ్మె నోటీసు



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : ఈనెల 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించి రఘునాథపాలెం ఎంపిడివో అశోక్‌కుమార్‌కు గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెలో గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. కార్మికులంతా పాల్గొని ఈ సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బానోత్ మంగీలాల్, కార్యదర్శి మేళ్లచెరువు రాజగోపాల్, నాయకులు రాము, లింగయ్య, శివలాల్, వీరన్న, సామ తదితరులు పాల్గొన్నారు.

## 12న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/సత్తుపల్లి: కార్మికులను పెట్టుబడిదారులు, బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటియూసి) నాయకులు సోమవారం పిలుపునిచ్చారు. సత్తుపల్లిలో సమ్మె పోస్టర్లు ఆవిష్కరించిన నాయకులు మాట్లాడుతూ నరేంద్ర మోడీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కార్మిక హక్కులను దెబ్బతీస్తోందని విమర్శించారు. డిమాండ్లలో కాంట్రాక్ట్ విధానం రద్దు, అసంఘటిత కార్మికులకు సంక్షేమ చట్టం, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26,000, పెన్షన్ రూ.9,000, నాలుగు లేబర్ కోడ్ల రద్దు ముఖ్యమైనవిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ, నాయకులు తడికమళ్ళ యోబు, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్కె రహమతుల్లా, ఖురాన్ సాబ్, షేక్ మైబు, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకతీతంగా మధిర అభివృద్ధి

- మధిరను రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాల్టీగా తీర్చిదిద్దుతా
- మధిర మున్సిపల్ ఎన్నికల ప్రచారం డిప్యూటీ సిఎం భట్టి





ప్రజాపక్షం/ మధిర : రాజకీయాలకతీతంగా మధిర పట్టణాభివృద్ధి చేయటమే నా లక్ష్యమని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మధిర ప్రజలకు ఏ అవసరం వచ్చినా నేను సిద్ధంగా ఉంటానని అన్నారు. సోమవారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో డిప్యూటీ సిఎం భట్టి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్‌షోకు హాజరైన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. మధిరను రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని అన్నారు. మధిర మున్సిపాల్టీలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుంటే మధిర పట్టణ అభివృద్ధికి అవకాశం లభిస్తుందని తెలిపారు. గత పది సంవత్సరాల టిఆర్ఎస్ ప్రభుత్వంలో మధిర పట్టణ అభివృద్ధి కుంటుపడిందని, ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, అదృష్టవశాత్తు డిప్యూటీసిఎంగా ఉన్న తాను ఆర్థిక, విద్యుత్ ప్రణాళిక శాఖలు చూస్తున్నానని, మధిర పట్టణ అభివృద్ధికి ఇది ఒక చక్కని అవకాశం అని తెలిపారు. ఎన్నికలు ముగిసిన తర్వాత పట్టణంలో అన్ని వర్గాల నుంచి రాజకీయాలకతీతంగా ప్రముఖులను ఎంపిక చేసి మధిర పట్టణ అభివృద్ధి అథారిటీని ఏర్పాటు చేసి వారి సలహాలు, సూచనలతో మున్సిపాలిలో అభివృద్ధి పనులను ముందుకు తీసుకువెళ్తానని తెలిపారు. కాంగ్రెస్ కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి మధిర అభివృద్ధికి ప్రజలు బాటలువేయాలని కోరారు. మధిరలో కోట్లాది రూపాయల నిధులతో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, త్వరలోనే అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసి మున్సిపాలిటీ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని, రాష్ట్రంలోనే మధిరను మోడల్ సిటీగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొండబాల కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ, రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్, టిడిపి కూటమి అభ్యర్థులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పిఆర్‌టియు ఆవిర్భావ దినోత్సవం



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పిఆర్‌టియు పిఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం పిఆర్‌టియు భవన్‌లో నిర్వహించిన ఆవిర్భావ వేడుకల్లో జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్‌రావు సంఘం జెండాను ఆవిష్కరించారు. సంఘం వ్యవస్థాపకులు సామినేని హిమవంతరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల హక్కులు, ఆత్మగౌరవం కోసం పిఆర్‌టియు అంకిత భావంతో పోరాడుతుందని సంఘం అధ్యక్షులు కట్టా శేఖర్‌రావు తెలిపారు.

**ఘనంగా పిఆర్‌పిఏ ప్రథమ వార్షికోత్సవం :**

పెన్షనర్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పిఆర్‌పిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోత్కూరి మధు ప్రభుత్వాన్ని కోరారు. పిఆర్‌పిఏ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం పిఆర్‌టియు కార్యాలయం లో పిఆర్‌పిఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, సీనియర్ నాయకులు సాధు లక్ష్మణ్‌రావు జెండా ఆవిష్కరించారు ఈ సందర్భంగా జరిగిన సభలో మోత్కూరి మధు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్స్‌కు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేసి వారికి ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు వ్యవస్థాపకులు సామినేని హిమవంతరావు కుమారుడు సామినేని రమేష్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు, కందుల వెంకటనర్సయ్య, చిత్తలూరి ప్రసాద్, గుడిపూడి శ్రీనివాస్, లింగం సతీష్, వినోద్, పి. కొండలరావు, కొత్త శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి లేని పాలన కమ్యూనిస్టులతోనే సాధ్యం

- 7వ వార్డులో సిపిఐ అభ్యర్థి ఊట్ల కొండలరావును అఖండ మెజార్టీతో గెలిపించండి



ప్రజాపక్షం/ మధిర : అవినీతి రహిత పాలన కేవలం కమ్యూనిస్టులతోనే సాధ్యమని సిపిఐ జిల్లా సహాయ కారదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. మధిర మున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లిలో 7వ వార్డు సిపిఐ అభ్యర్థి ఊట్ల కొండలరావు గెలుపును కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ నిత్యం ప్రజలతో ఉండే వారికే ప్రజా సమస్యలపై పట్టు ఉంటుందని, వాటి పరిష్కారానికి పోరాటాలు చేస్తారని, ఓట్లు అడిగేందుకు ఎన్నికల సమయంలో కొందరు డబ్బు సంచులతో వస్తుంటారని, వారు మాయమాటలు చెప్పి ప్రలోబాలకు గురిచేసేందుకు ప్రయత్నిస్తారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓట్ల కోసం వచ్చే వారు ఎన్నికలుపూర్తయిన తర్వాత మళ్లీ కనిపించరని, సమస్యల కోసం విన్నవించుకుందామన్నా కనీసం ముఖం కూడా చూపించరన్నారు. పదవులున్నా లేకున్నా ప్రజలతో నిత్యం ఉండేది సిపిఐనేనని, సిపిఐ బలపర్చిన బిఆర్ఎస్, సిపిఎం అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. 7వ వార్డు సిపిఐ అభ్యర్థి ఊట్ల కొండలరావు ఎన్నికల గుర్తు కంకి కడవలి గుర్తుపై మీ అమూల్యమైన ఓటు ముద్ర వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకువిజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో నడవాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి



ప్రజాపక్షం/కూసుమంచి: ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్లారుపల్లి గ్రామంలో 14వ వార్డు కౌన్సిలర్‌గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తమ్మినేని నవీన్, 16వ వార్డు కౌన్సిలర్‌గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇనుప రాంబాబు విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశీస్సులతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించుకోవాలంటే అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల మద్దతుతోనే ఈ రెండు వార్డులను భారీ మెజార్టాతో గెలవబోతున్నామని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో అభ్యర్థులతో పాటు, తమ్మినేని మంగతాయి 15వ వార్డు కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థి, జోనల్ ఇన్చార్జులు జూకూరి గోపాల్‌రావు, జొన్నలగడ్డ రవికుమార్, చాట్ల పరుశురాం, కోటమర్తి గోపయ్య, కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చివరి రోజు హోరెత్తిన ప్రచారం

- ఎర్రజెండా రెపరెపలు
- ఎన్నికలు తెచ్చిన కూనంనేనికే జై కొడుతున్న ప్రజలు
- ఆకట్టుకొన్న కొమ్ము నృత్యం



ప్రజాపక్షం/పాల్వంచ : గత వారం రోజుల నుండి హోరెత్తిన మైకుల హోరు సోమవారం సాయంత్రం ఐదు గంటల నుండి మూగబోయాయి. ప్రచారానికి చివరి రోజు సిపిఐ, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు తమ ప్రచారాన్ని హోరెత్తించారు. ఈ సంధర్భంగా 38వ, డివిజన్‌లో పోటీ చేస్తున్న చెరుకూరి శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గొత్తికోయల కొమ్ము నృత్యం విశేషంగా ఆకట్టుకొంది. దీనితో పాల్వంచలోని 26 డివిజన్‌లలో ఎర్రజెండాలు రెపరెపలాడాయి. 1వ, డివిజన్ వల్లపు లలిత కుమారి, 2వ, డివిజన్ పగిడిపల్లి ఆదిలక్ష్మి, 3 నుండి గుగులోత్ కల్పన, 4వ, డివిజన్ రావుల స్వాతి, 5 ఆలపాటి లీలావతి, 6, ఉప్పుశెట్టి రాహుల్, 7, బానోత్ శారద, 8, కాకటి దుర్గాభవాని, 9, వాడె లక్ష్మి, 31 నునావత్ శ్యామల, 32 ధర్మసోత్ మోతీలాల్, 33 వజ్జా రాజేశ్వరి, 34 భట్టు విజయ, 37 మడకం కమల, 38 చెరుకూరి శేఖర్‌బాబు, 39 మహమ్మద్ అస్లాం, 40 అడుసుమిల్లి సాయిబాబ, 41 గొర్రె అన్నపూర్ణ, 42 గుత్తా వెంకట క్రిష్ణారావు, 43 గోసనపల్లి వెంకటేష్, 44 వీసంశెట్టి విశ్వేశ్వరరావు, 45 మొగులూరి శివరామక్రిష్ణ (గౌతమి క్రిష్ణ), 46 మహమ్మద్ జిలానీబేగం, 47 గుర్రం వెంకటేశ్వర్లు, 48 గుగులోత్ బాలు, బోయిన విజయ కుమార్‌లు తమ డివిజన్ పరిధి బొల్లోరుగూడెం, ప్రశాంత్ కాలని, వెంగళరావుకాలని, కేటిపిఎస్ ఇంటర్ మీడియెట్, కాలని, హమాలి, కాంట్రాక్టర్స్ కాలని, ఇందిరా కాలని, జయమ్మ కాలని, శ్రీనివాసకాలని, పిల్లవాగు, పేటచెరువు, గుడిపాడు, మంచికంటినగర్, నవభారత్ గాంధీనగర్, శేఖరం బంజెర, రాజీవ్, కేసిఆర్ నగర్, కరకవాగు, జ్యోతినగర్, సీతారామపట్నం,బ్రాహ్మణ బజార్, శాస్త్రిరోడ్, గట్టాయిగూడెం, ఒడ్డుగూడెం, టీచర్స్‌కాలని, చాకలి బజార్, ఓల్డ్ గాంధీ నగర్, కేఎస్‌పి రోడ్, రామ్‌నగర్, పోస్టాఫీసు సెంటర్, శాస్త్రి రోడ్, రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్, బాపూజీ నగర్, జయమ్మ, వికలాంగుల కాలని, దమ్మపేటసెంటర్, నెహ్రూనగర్, దమ్మపేట సెంటర్, శ్రీనగర్ కాలని, పాత గాంధీ నగర్, కొమ్ముగూడెం, గొల్లగూడెం, గోవర్ధనగిరి తదితర ప్రాంతాలలో హోరుగా ప్రచారం నిర్వహించారు. భారీ ఎత్తున కదిలి వచ్చిన కార్యకర్తలు, అభిమానులతో బైక్ ర్యాలీ, రోడ్ షోలతో ప్రచారాన్ని హోరెత్తించారు. ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. తమను గెలిపిస్తే డివిజన్‌లలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో చుట్టపు చూపుగా వచ్చిపోయే వారిని నమ్మొద్దని సూచించారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రజల పక్షాన పోరాటం చేసేది సిపిఐ అన్నారు. కార్పోరేషన్ నిధులు సద్వినియోగం కావాలంటే కమ్యూనిస్టు పార్టీని బలపరచాలన్నారు. ప్రజల కష్టాలు, సమస్యలు తెలిసిన కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించి ఎర్ర జెండాను అక్కున చేర్చుకోలన్నారు. పాలనలో జవాబుదారీ తనంగా బాధ్యత వహిస్తామని స్పష్టం చేశారు. పాల్వంచ సమగ్రాభివృద్ధికి ఎన్నికలు తీసుకొచ్చిన ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావుకు మద్దతు తెలుపుతూ తెలుగుదేశం, సిపిఐ పార్టీలు బలపరిచిన అభ్యర్థుల కంకీ కొడవలి గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సబ్యులు ముత్యాల విశ్వనాధం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, తెలుగుదేశం రాష్ట్ర నాయకులు జివి. రత్నాకర్, నాయకులు శనగారపు శ్రీనివాస్, సర్వయ్య, వైఎస్.గిరి, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, రామాచారి, మదుపు ఉపేంద్రాచారి, నల్లమల్ల వేణు, కఠారు చంద్రశేఖర్, కోటేశ్వరరావు, శ్రీరామినేని మోహన్, మేకా వరప్రసాద్, ఉప్పుశెట్టి సునీల్, వర్క అజిత్, నామా నవీన్, రాంబాబు, వనమా రామ క్రిష్ణ, పాండురంగాచార్యులు, అన్నవరపు అశోక్, ఈశ్వరయ్య, లింగయ్య, శ్రీను, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్‌తోనే మధిర పట్టణాభివృద్ధి సాధ్యం

- మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు



ప్రజాపక్షం/ మధిర : మధిర పట్టణం అభివృద్ధి చెందాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ కూటమి అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం చివరి రోజు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు వార్డుల్లో పాల్గొని విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా నామ మాట్లాడుతూ మున్సిపాల్టీలో ప్రజలను ఓట్లు అడగడానికి ముందు భట్టివిక్రమార్క శాసనసభ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ కార్డుల ఇచ్చి మూడు నెలల్లో అధికారంలోకి రాగానే అందులో ఉన్న హామీలన్నింటిని అమలు చేస్తామని చెప్పిన భట్టివిక్రమార్క రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ హామీలను ఎందుకు నెరవేర్చలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మధిర పట్టణంలో జరిగిన ప్రతి అభివృద్ధి కేసీఆర్ పాలనలోనే జరిగిందని తెలిపారు. 100పడకల ఆసుపత్రి, ట్యాంక్ బండ్ నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్, సెంట్రల్ లైటింగ్, డివైడర్, పార్కులు తదితర అభివృద్ధి పనులు పూర్తి చేశామని గుర్తు చేశారు. మధిర పట్టణంలో తాగు, సాగు నీటి సమస్యలు లేకుండా కరెంటు కష్టాలు తొలగించిన ఘనత కేసిఆర్‌కే దక్కుతుందన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల వేళ శంకుస్థాపనలు, నిధులుమంజూరు పేరుతో హడావుడి చేస్తున్న భట్టివిక్రమార్కకు కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు గడిచిన తర్వాత మధిర అభివృద్ధి గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. ఆటో కార్మికుల జీవన భద్రత, సంక్షేమంపై కాంగ్రెస్ కు ఎలాంటి చిత్తశుద్ధి లేదన్నారు. అలాగే అర్హులైన ప్రతి పేద కుటుంబానికి తప్పనిసరిగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధిర మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ తరుపున, అలాగే బిఆర్‌ఎస్ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులను ప్రజలుభారీ మెజార్టీతో గెలిపించి అభివృద్ధి పాలనకు మద్దతుగా నిలవాలన్నారు. కారు గుర్తుపై ఓటేసి బిఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, మధిర అసెంబ్లీ ఇన్‌చార్జి, మాజీ జెడ్పిటిసి లింగాల కమల్‌రాజు ఆధ్వర్యంలో గులాబీ శ్రేణులు కూటమి అభ్యర్థులతో కలిసి ప్రచారాన్ని హోరెత్తించారు ఈ కార్యక్రమంలో మధిర నియోజకవర్గం, పలు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సత్తుపల్లి, కల్లూరులో జెండా ఎగురవేస్తాం : సండ్ర



ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి, కల్లూరు పురపాలకాల్లో టిఆర్ఎస్ జండా ఎగురవేస్తామన్నారు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య. సోమవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్తుపల్లిలో నిర్మాణంలో ఉన్న షాధిఖానాను మూలాన పడేశారనీ, మినీ స్టేడియం మంజూరు చేస్తే ఆ నిధులను మళ్ళించారనీ, అనేక రకాల సామాజిక భవనాలను మంజూరు చేస్తే వాటిని విస్మరించారనీ విమర్శించారు. సామాన్యుడిగా ఉన్న నా పైన ముకమ్మడిగా దాడి చేస్తున్నారు. ఇద్దరు మంత్రులతో ర్యాలీ లు చేస్తున్నారు అంటే వాళ్ల ఓటమి అంగీకరించినట్టే అని వెంకట వీరయ్య అన్నారు. వాళ్ళ ర్యాలీలకు ఆదరణ లేదని, వాళ్ళ ఉపన్యాసాలే వాళ్ళ ఓటమినీ అంగీకరించేలా ఉన్నాయన్నారు. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ మార్క్ అభివృద్ధి లేదనీ, సింగరేణి బాధితులకు ఏం న్యాయం చేశారని ప్రశ్నించారు.సింగరేణి బాదితులకు ఒక్క ఇల్లైనా కట్టించారా అంటూ ప్రశ్నించారు. ఇప్పటి వరకూ రైతు బంధు వేయలేదని, పెన్షన్ లు పెంచలేదని, తులం బంగారం ఊసేలేదని ఎద్దేవ చేశారు. ఉచిత బస్సు తప్పితే ఇంకేం వాళ్ళు చేయలేదనీ వివరించారు. తానెప్పుడూ జూదం ఆడలేదని, ఆడించలేదనీ, మా మీద అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. గెలిచినా, ఓడినా నేను ప్రజల మధ్యలోనే ఉన్నానన్నారు. బి ఆర్ ఎస్ తరపున నిలబడిన వాళ్ళు సామాన్యులనీ, ఓటరు మహాశయులు ఆలోచించాలని, నిరంతరం మీ మధ్యలో ఉండే అభ్యర్థులనే నిలబెట్టామని, వాళ్ళని గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభం



ప్రజాపక్షం/కారేపల్లి:మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు లేని సమయంలో గ్రామంలోని ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా నిరోధించేదాని కోసం ఎక్కడి ప్రజలు అక్కడే తమకు జీవనోపాధి కల్పించుకోవాలని, గ్రామంలోని పంట పొలాలను అభివృద్ధిలోకి తీసుకురావడం కోసం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. దీని ద్వారా ప్రతి కుటుంబానికి సంవత్సరంలో 100 రోజులు ఉపాధిని కల్పించడమే కాకుండా తమ గ్రామంలోనే స్వేచ్ఛగా పని చేసుకునే సౌకర్యాన్ని కల్పించిందని తెలిపారు. అనేక మంది కూలీలు దీని ద్వారా ఉపాధి పొందుతూ జీవనం గడుపుతున్నారని, అలాంటి పథకాన్ని రద్దు చేసే కార్యక్రమాలను నేటి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూనుకుంటుందని, దీనిని అందరూ కలిసికట్టుగా వ్యతిరేకించడం జరుగుతుందని పేర్కొన్నారు. అందరు ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు. కొలతల ప్రకారం పనిచేసుకుంటే అందరికీ సరైన కూలి పడుతుందని చెప్పారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి అనిల్‌కుమార్, ఉప సర్పంచ్ బిక్కులాల్, వార్డు సభ్యులు గాంధీ, దేవి, సుమ, రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్రమోడీ దిష్టిబొమ్మ దహనం



ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి మండలంలో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో భారత్‌అమెరికా సోమ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను చేశారు. సోమవారం పట్టణంలోని నీలం రామచంద్రయ్య భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలోజిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కొత్త లేబర్ కోడ్ల వల్ల కార్మికుల సామాజిక భద్రత దెబ్బతింటోందని, విద్యుత్ సవరణ బిల్లుతో ఛార్జీలు పెరిగి రైతులుపేదలకు నష్టం జరుగుతుందని, విత్తన సవరణ బిల్లుతో ప్రైవేట్ కంపెనీల పట్టు పెరుగుతుందని విమర్శించారు. ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈనెల 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ఏ. వెంకన్న, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు బీరెల్లి లాజర్, గంటా శ్రీను, అమర్లపూడి శరత్, మండల కార్యదర్శి తాటి రాజు, ఒగ్గు నాగిరెడ్డి,దుంప రాఘవులు, సార కిషోర్, సున్నం రాజారావు, బొజ్జ వెంకటేశ్వరరావు, ప్రకాష్ రావు నెక్కొండ అలివేలు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# సీతయ్య ఆశయసాధన కోసం కృషిచేయాలి

## సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం



**ప్రజాపక్షం/చింతకాని :** సీపీఐ సీనియర్ నాయకులు , స్వాతంత్ర్య సమరయోధుడు నాగిలిగొండ గ్రామానికి చెందిన ఏపూరి సీతయ్య ధన్యజీవి అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పేర్కొన్నారు. నాగిలిగొండ గ్రామానికి చెందిన ఏపూరి సీతయ్య దశదిన కర్మ సోమవారం నాగిలిగొండ గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా సీతయ్య చిత్రపటానికి భాగం హేమంతరావు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా భాగం మాట్లాడుతూ సీతయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో కొరియర్‌గా పనిచేశారని, బ్రతికినంతకాలం ఎర్రజెండా ని ఎత్తుకొని పార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషిచేశాడన్నారు.ఈ ప్రాంతంలో కమునిస్టు ఉద్యమం బలపడటానికి సీతయ్య పాత్ర ఎనలేనిదన్నారు. నేటి యువత సీతయ్య ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రజాసమస్యలపై పోరాటాలే సీతయ్యకు మనం ఇచ్చే ఘన నివాళులన్నారు. సీతయ్య ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు.. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, ఏనుగు గాంధీ, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, పావులూరి మల్లిఖార్జునరావు, కూచిపుడి రవి, పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శులు అబ్బూరి మహేష్, మార్గం శ్రీను జిల్లా కౌన్సిల్ సభ్యులు రాసాల మోహన్‌రావు, చిన్నమండవ, బస్వాపురం, తిరుమలాపురం సర్పంచులు పర్చా రామచంద్రరావు, ఆవుల నర్సింహారావు, చాపలమడుగు వీరబాబు, సిపిఐ నాయకులు పదిమల వెంకటనర్సయ్య, కొల్లి రవికుమార్, తాళ్లూరి యాదగిరి, గుండ్ల బేబీరాణి, నాగిలిగొండ శాఖ కార్యదర్శి చాట్ల రమేష్, బాబు, ముఖర్జీ, షేక్ హుస్సేన్, ఏపూరి నర్సయ్య బస్వాపురం ఉపసర్పంచ్ చంద్రకాని నర్సింహారావు తదితరులు నివాళులర్పించారు.

# సిపిఎం, బిఆర్ఎస్, సిపిఐ కూటమి అభ్యర్థులను గెలిపించాలి

## ఇంటింటి ప్రచారంలో భూక్యా వీరభద్రం





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి, వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌళిక సమస్యల పరిష్కారం కోసం సిపిఎం, బిఆర్ఎస్, 15 వార్డులో మాత్రమే పోటీ చేస్తున్న సిపిఐ కూటమి అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ప్రచారానికి చివరి రోజున వైరా మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు సిపిఎం కౌన్సిలర్ అభ్యర్థి మాదినేని రజిని, 9వ వార్డు సిపిఎం కౌన్సిలర్ అభ్యర్థి గుడిమెట్ల రజిత గెలిపించాలని ఆయన ఇంటింటి విస్తృత రచారం నిర్వహించారు. 6వ వార్డు పరిధిలోని సుందరయ్యనగర్, 9వ వార్డు పరిధిలోని రాశేఖర్ నగర్ ప్రాంతాల్లో ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం మాట్లాడుతూ కాంగ్రేస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 25 నెలలు గడిచినా వైరా మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని విమర్శించారు. ముఖ్యంగా రాజశేఖర్‌నగర్‌లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మున్సిపాలిటీ పాలకులు దీనిపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ప్రజల పక్షాన నిలబడి స్థానిక సమస్యల పరిష్కారం కోసం సిపిఎం నిరంతరం ఉద్యమాలు నిర్వహించిందని గుర్తు చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే నిజాయితీ గత ప్రతినిధులుగా సిపిఎం, సిపిఐ, బిఆర్ఎస్ కూటమి అభ్యర్థులు మాత్రమే ఉంటారని పేర్కొంటూ వారిని గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రంలో 9వ వార్డు అభ్యర్థి గుడిమెట్ల రజిత, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పారుపల్లి ఝాన్సి, మెరుగు రమణ, సిపిఎం, బిఆర్ఎస్, టిడిపి నాయకులు బాణాల శ్రీనివాసరావు, కె.నరేంద్ర, మచ్చా నరేంద్ర, కొండబోయిన ఉమావతి, వజ్జా రామారావు, తాతా పద్మ, బాదావత్ శ్రీనివాస్, బానోతు బన్సీలాల్, తాళ్లపల్లి విజయ, బాజోజి రమణ, తోట కృష్ణవేణి, కంసాని మల్లిక, శ్రీదేవి, సుంకర భాస్కర్, నరేస్, అప్పారావు, ప్రసాద్, బోడేపూడి వీరభద్రం, బాణాల వెంకట్రావమ్మ, సుబ్రమణ్యం, షేక్ బిలాల్, షేక్ మజీద్‌బి, రెహనా, రుద్రాక్షల వెంకటాచారి, నారికొండ అమరేదర్, ముత్తమాల విజయరావు, బాణాల కృష్ణమాచారి, యరమల మాధవరెడ్డి, పగిడిపల్లి కాటయ్య, సూరయ్య పాల్గొన్నారు.

# ప్రచారంలో ప్రజలను ఆకట్టుకున్న వుండ్రు వరలక్ష్మి





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో 20వ వార్డు కాంగ్రేస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి లయన్ ఐ కేర్ హాస్పిటల్ నిర్వాహకులు వుండ్రు శ్యామ్‌బాబు సతీమణి వరలక్ష్మి తనదైన రీతిలో ప్రచారంలో దూసుకుపోతున్నారు. గడపగడపకు వెళ్లిన వరలక్ష్మికి మహిళలు స్వాగతం పలుకుతూ హారతి అందించారు. కులమతాలకు అతీతంగా వరలక్ష్మి విజయంలో భాగస్వాములు అవుతున్నారు. విద్యావంతురాలైన వరలక్ష్మి 20వ వార్డుకు కాంగ్రేస్ పార్టీ తరపున పోటీ చేయడం ఒక వరం అని వారు తెలుపుతున్నారు. సేవా కార్యక్రమాల్లో ఏ విధంగా ముందుకు వెళ్లారో వార్డు అభివృద్ధిలో కూడా అదే విధంగా ముందు ఉంటానని ఆమె తెలుపుతున్నారు. ఈ సందర్భంగా ప్రచార పర్వంలో వుండ్రు వరలక్ష్మి ఆట్లాడుతూ వార్డుప ఐవరాలు కురిపిస్తున్నారు. ప్రతి రోడ్డుకు రెండు ప్రక్కల డ్రైనేజీల నిర్మాణం, సిసి కెమెరాలు ఏర్పాటు, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు, ప్రతినెల సమస్యల కోసం తెలుసుకునేందుకు వార్డు రచ్చ బండ కార్యక్రమం, అర్హులైన ప్రతిఒక్కరికి పింఛన్‌లు ఏర్పానటు, ఇళ్లు లేని ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, త్రాగునీటి సమస్య లేకుండా ప్రణాళిక, విద్యుత్ లైన్‌లో ఏర్పాటు, ప్రతి రోడ్డులో ఎల్ఈడి బల్బుల ఏర్పాటు, ప్రతి నెల వార్డులో ఉచిత వైద్యశిబిరం, ఉచిత కంటి పరీక్షలు చేయడంతో జరుగుతుంది. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సహకారంతో వార్డులో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేయడం జరుగుతుంది. చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాల్సిన బాధ్యత మీదే అని వుండ్రు వరలక్ష్మి వాటర్‌లకు వరాల జల్లు కురిపించారు. ఒక్కసారిగా వరలక్ష్మి ప్రచారంలోని మాటలు తూటాలుగా పేలడంతో ప్రజలు ఆమె మాటలకు ఫిదా అయ్యారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు ఆర్టీసీ డ్రైవర్ కి తీవ్ర గాయలై మృతి చెందాడు. పెనుబల్లి మండలం లంకపల్లి గ్రామంలో జాతీయ రహదారిపై సోమవారం బైక్ ని బొగ్గు లారీ ఢీకొట్టడంతో బైక్ పై వెళుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు పెనుబల్లి గ్రామం బీసీ కాలనీకి చెందిన రాయల ప్రకాష్ (35) గా గుర్తించారు. సత్తుపల్లి డిపోకి చెందిన ఓ ప్రైవేటు ఆర్టీసీ బస్సు డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. పెనుబల్లి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు ప్రమాదానికి కారణమైన బొగ్గు టిప్పర్ లారీని డ్రైవర్ ని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

# కల్లూరును మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తా



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరును మోడల్ మున్సిపాలిటీగా తయారు చేస్తానని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. కల్లూరు లోని ఎన్నికల ప్రచారంలో భాగంగా డీఎస్పీ ఫంక్షన్ హాల్ లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ 1983 నుండి కల్లూరుకు ప్రత్యేక స్థానాన్ని ఇస్తున్నట్లు ఆయన అన్నారు. సాగు, తాగు, విద్యుత్, రవాణా రంగాలతో పాటు సంక్షేమ పథకాలైన రేషన్ కార్డులు ఉచిత విద్యుత్ ఉచిత బస్సు తదితర సంక్షేమ పథకాలన్నీ అందించడంలో ముందున్నామని ఖమ్మం టు అశ్వరావుపేట వరకు నాలుగు లైన్లు రోడ్డు త్వరలో జరగబోతుందని అన్నారు. కల్లూరు కు సబ్ డివిజన్ కార్యాలయం తో పాటు మినీ కార్యాలయాలు అన్నిటిని ఒకచోట నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధమైందని ఆయన వివరించారు. రాష్ట్రంలో కల్లూరు మున్సిపాలిటీని అభివృద్ధిలో ముందంజలో ఉంచుతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజాదేవి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు పసుమర్తి చందర్రావు, వార్డు అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యం




**ప్రజాఫక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** నగరంలోని ముస్తాఫానగర్ పట్టణ ఆరోగ్యం కేంద్రం డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో తెలంగాణ మైనార్టీస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థుల మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వేణుమాధవరావు ముఖ్య అతిథిగా పాల్గొని పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు. పిల్లలు ఆరోగ్యంగా వుండాలని, ఆరోగ్యవంతమైన విద్యార్థులు సమాజానికి, దేశానికి వరమని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే పిల్లలు మానసికంగా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారని, ఇష్టంగా చదువుకుంటారని, మానసికంగా కూడా ప్రశాంతంగా ఉండి మంచి మార్కులు సాధిస్తారని, పిల్లలు టెన్షన్ లేకుండా ఫ్రీగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణాదేవి, సిహెచ్ఓ రాజేశ్వరి, ఎన్‌సిడి కో ఆర్డినేటర్ సత్యనారయణ, హెచ్ఈఓ సత్యనారాయణ, ముస్తాఫానగర్ ఆరోగ్య సిబ్బంది, స్కూల్ ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నీలాద్రి తీరునాళ్ళ ఏర్పాట్లపై సబ్ కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఈ నెల 15న మండల పరిధి లోని నీలాద్రి లో జరగనున్న శివరాత్రి తిరునాళ్ళ పై సోమవారం ఆలయ ప్రాంగానంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అధికారులతో సమీక్ష నిర్వహించడం జరిగింది. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్టాల నుండి ఇతర జిల్లాల నుండి భక్తులు భారీ సంఖ్యలో హాజరు అవుతారని భక్తులకు కల్పించే సౌకర్యాలు, మంచినీళ్లు, బస్సులు, రవాణా, వాహనాలు పార్కింగ్, విపిలకు ఏర్పాట్లు పోలీస్ బందోబస్త్ వంటి విషయాల పట్ల చర్చించారు. ఈ సమావేశంలో తహాశీల్దార్ వీరభద్రయ్య నాయక్, ఎంపీడీఓ అన్నపుర్ణ, ఆలయ ఈ ఓ రాజనీకుమారి, నీలాద్రి చైర్మన్ నరసింహారావు, యస్ ఐ వెంకటేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ముగిసిన ప్రచారం.. పంపకాలు ప్రారంభం

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో సోమవారంతో ప్రచారం ముగిసింది. ఆ వెంటనే ఓటర్ల జాబితాతో ఇంటింటికి పోటాపోటీగా ఇరువురు పార్టీలు సుమారుగా 2000 నుంచి 5000 వరకు పంపిణీ చేస్తున్నట్లు ఓటర్లలో ప్రచారం జరుగుతుంది. మరో కొన్ని వార్డులలో గత కొన్ని రోజులుగా ఇంటింటికి కేజీ చికెన్, మటన్ , ఫిష్ పంపిణీ చేస్తున్నారు. 20 వార్డులలో వలస ఓటర్లు జాబితాతో ఓటు మీది నగదు మాది అంటూ హైదరాబాద్, బెంగళూరు, ఖమ్మం , చెన్నై తదితర ప్రాంతాలలో ఉంటున్న వారందరినీ రప్పిస్తున్నారు. మరి కొన్ని వార్డుల్లో కొద్దిరోజులుగా చుక్క ముక్క ఇంటింటికి వెళ్తుంది. జనరల్ స్థానాల్లో ఓటు ధర ఘనంగా పెరిగింది. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఓటుకు నోటు చుక్క ముక్క గత వారం రోజులుగా విస్తారంగా అభ్యర్థులు పంపిణీ చేస్తున్నారు. ఒక్కో అభ్యర్థి 20 లక్షల నుంచి 30 లక్షల వరకు పంపిణీ విపరీతంగా విస్తారంగా జరుగుతుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక రేటు, రాత్రి కాల సమయంలో ఒక రేటు, తెల్లవారుజామున మరో రేటు ,మొత్తం మూడుసార్లు పంపిణీ చేసే అవకాశం ఉందని ఓటర్లలో అభ్యర్థుల్లో చర్చలు కొనసాగుతున్నవి.

# యూరియా ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలి

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** రైతులకు యూరియా ఆన్లైన్లో బుక్ చేసుకునే విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చాపలమడుగు రాంమూర్తి ఓ ప్రకటలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నడూ లేని యూరియా కొరత పెరిగిందని ఫలితంగా వ్యవసాయంలో పంటల దిగుబడి తగ్గిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్లైన్ యాప్ ద్వారా యూరియా కొనుగోలు చేయడంలో పట్టాదారులకు, కౌలుదారులకు మాత్రమే యూరియా పంపిణీ చేయడం అంటే పట్టా పాస్ పుస్తకాలు లేని రైతులకు యూరియా ఏ విధంగా అందిస్తారో ప్రభుత్వమే సమాధానం చెప్పాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని రైతులు ఆన్లైన్ వినియోగం చాలా తక్కువ అని ఆండ్రాయిడ్ ఫోన్లు లేని రైతులే అధికంగా ఉన్నారని వారు ఏ విధంగా ఆన్లైన్లో బుక్ చేసుకుంటారో ప్రభుత్వ పెద్దలే సమాధానం చెప్పాలని వారన్నారు. ప్రస్తుత వ్యవసాయ సాగులో ముందు తరం పెద్దలు ముసలివారు ప్రధమంగా వ్యవసాయం సాగు చేస్తున్నారని. వారిలో చాలామందికి చదివే సక్రమంగా రానప్పటికీ ఆన్లైన్లో బుక్ చేసుకోవడం అంటే తీవ్ర గందరగోళానికి లోనవడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి కొరతను నివారించేలా యూరియా దిగుమతులు పెంచి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని వారన్నారు.

# ముగిసిన ప్రచార పర్వం

- సిపిఐ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం
- అడుగడుగునా కూనంనేనికి నీరాజనం
- ఇంటింటి ప్రచారంలో పాషా బిజీబిజీ





**ప్రజాపక్షం/కొత్తగూడెం :** కార్పోరేషన్ ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది. జిల్లాలోని కొత్తగూడెం కార్పోరేషన్, ఇల్లెందు, అశ్వారావు పేట మున్సిపాలిటీలలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఆయా రాజకీయ పార్టీలు ప్రచారానికి తెరవేశారు. ఇన్ని రోజుల పాటు 60 డివిజన్ల వ్యాప్తంగా టిడిపి, ప్రజా సంఘాలతో కలిసి సిపిఐ తన అభ్యర్ధుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారాన్ని హోరెత్తించడంతో ప్రత్యర్ధులు బెంబేలెత్తుతున్నారు. అశ్వారావు పేట మున్సిపాలిటీ పరిధిలో 1 వార్డు, ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో 2 వార్డుల్లో సిపిఐ పోటీ చేసింది. ప్రధానంగా ఈ ఎన్నికల్లో కొత్తగూడెం కార్పోరేషన్ వ్యాప్తంగా సిపిఐ, కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలు విడివిడిగా పోటీలో ఉన్నప్పటికీ బిజేపి మినహాయించి త్రిముఖ పోటీ కొనసాగ నుంది. సిపిఐ జనరల్ స్థానాల్లో సైతం పార్టీ వీరవిధేయులుగా ఉండే ఎస్సి సామాజిక వర్గానికి చెందిన వారికి కూడా సీట్లు కేటాయించారు. దీంతో ప్రతీ డివిజన్‌లో సిపిఐ తన సత్తా చాటేందుకు శక్తి వంచన లేకుండా పనిచేస్తోంది. దీంతో ఓ వైపు చూసిన ఎరుపు,పసుపు వర్ణపు జెండాలు రెపరెపలాడుతున్నాయి. ప్రతీ డివిజన్‌లోనూ కూనంనేని అభ్యర్ధుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచార రథంలో అభ్యర్ధులను ప్రక్కన పెట్టుకుని గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. దీంతో ప్రతీ చోట కూనంనేని నోట నుండి వచ్చే ప్రతీ మాటకు ప్రజలు కరతాళ ధ్వనులు కురిపిస్తుండటంతో పలు డివిజన్ల వ్యాప్తంగా మహిళలు హారతు పడుతూ స్వాగత నీరాజనాలు పలుకుతున్నారు.

**గెలుపే లక్ష్యంగా...**

కూనంనేని అంటేనే ఫైర్ బ్రాండ్. ఆయన మదిలో ఆలోచన పడాలేగానీ మడిమ తిప్పకుండా ముందుకు సాగే నైజం. ఎర్రజెండా నీడలో ఒదిగి ఎదిగిన కూనంనేని ఏ ఎన్నికనైనా సవాల్‌గా తీసుకుంటారనే ప్రచారం ఉంది. గత గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సైతం తనదైన శైలిలో రాజకీయ చాణిక్యునిలా ముందుకు సాగి అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేలా కృషి చేశారు. కార్పోరేషన్ పరిధిలోని 60 డివిజన్లవ్యాప్తంగా కలియతిరుగుతూ ఎంఎల్‌ఏ గా తాను చేసిన అభివృద్ధిని చెబుతున్న కూనంనేని గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

**పాషా బిజీబిజీ...**

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్ని డివిజన్ల వ్యాప్తంగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా డివిజన్ల వ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తోంది. వీలైనంత వరకు ఓటర్లను స్వయంగా కలుస్తూ సిపిఐ అభ్యర్ధులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌లు, రోడ్ షోలకు పెద్ద ఎత్తున ఓటర్లు హాజరవుతున్నారు. కూనంనేని నేతృత్వంలో ముందుకు సాగే చురుకైన నేతగా పేరున్న పాషా తనదైన శైలిలో అభ్యర్ధుల విజయానికి కృషి చేస్తున్నారు. వాక్ చాతుర్యం ఉన్నపాషా సమావేశాల్లో ఆకట్టుకునే ప్రసంగాలు చేస్తున్నారు. కూనంనేని దిశా నిర్ధేశానికి పాషా నాయకత్వం తోడుకావడంతో కార్పోరేషన్ పై ఎర్రజెండా ఎగరడం ఖాయమని విశ్లేషకులు ఉంటున్నారు. అంచనాల ప్రకారం సిపిఐ 30 నుండి 35, కాంగ్రెస్ 18 నుండి 22, బిఆర్ఎస్, ఇతరులు 6 నుండి 8 డివిజన్లలో విజయం సాధించే అవకాశాలు ఉన్నట్లు విశ్లేషకుల వాదన.

# సామగ్రి పంపిణీ, స్వీకరణ పకడ్బందీగా నిర్వహించాలి

**-డిస్ట్రిబ్యూషన్, లెక్కింపు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** మున్సిపల్ ఎన్నికలను పూర్తి స్థాయిలో నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియను అధికారులు పకడ్బందీగా ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈనెల 11న జిల్లాలో ఐదు మున్సిపాలిటీలలో నిర్వహించే మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ పెద్దతండాలోని ప్రియదర్శిని కళాశాలలో ఏర్పాటు చేసిన ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసిప్షన్, కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ సెంటర్లను కలెక్టర్ తిరుగుతూ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈనెల 10న ఎన్నికల సిబ్బంది అందించే సామగ్రి పంపిణీకి ముందస్తు ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. పోలింగ్ సామగ్రిని, పోస్టల్ బ్యాలెట్ పత్రాలు, పూర్తి సామగ్రి ఉందో లేదో ఎలా సరిచూసుకోవడం, బ్యాలెట్ బాక్స్, ఓటరు లిస్టు, బ్యాలెట్ పేపర్స్ చెక్ చేసుకోవడం, పోలింగ్ రోజున ఉదయమే సిబ్బంది పోలింగ్ స్టేషన్ వద్దకు చేరుకునే విధంగా వాహనాల ఏర్పాట్లతో రూట్ ఆఫీసర్లు బాధ్యత వహించాలన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటూ సమయానికి అనుగుణంగా సిబ్బందికి భోజనం ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెద్ద మున్సిపాలిటీ అయిన ఏదులాపురం నందు ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమైందని ప్రతి అంశంపైన క్షుణ్ణంగా అవగాహన చేసుకుని విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామగ్రి సేకరించడం, బ్యాలెట్ పేపర్స్ ఇవ్వడం, పివో డైరీ నింపడం, అన్ని ఫార్మ్ ఎలా నింపాలి, ఏజెంట్స్ సిగ్నేచర్ ఎక్కడ తీసుకోవాలి, పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బ్యాక్స్ సీలింగ్, స్ట్రాంగ్ రూం సెంటర్‌కు తరలింపు తదితర అంశాల మీద పూర్తి ఉండాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు వారికి ఏర్పాటు చేసిన చోటనే ఉండేలాగా చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు రిసెప్షన్ కేంద్రాలు, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ అవసరమైన సదుపాయాలు భోజనం, పోలింగ్ సిబ్బందికి సునాయాసంగా తెలిసేలా సైన్‌బోర్డ్స్, వాహనాల పార్కింగ్‌కు అవసరమైన స్థలం ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూము వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఉండాలన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద నిబంధనల మేరకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం రిటర్నింగ్ అధికారి నవీన్ బాబు, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపిడివో లు సురేందర్, ఎర్రయ్య, మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ, ప్రియదర్శిని కళాశాల యాజమాన్యం నవీన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నేను రాజకీయాల్లోకి వచ్చింది సేవ చేయడానికే..

**బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి దొంతబోయిన వెంకటేశ్వర్లు**



**ప్రజాపక్షం/వైరా:** నేను రాజకీయాల్లోకి వచ్చింది, సేవ చేయడానికి నాకు ఎలాంటి స్వార్థం లేదు. నేను ఓ నమ్మకంతో మీ ముందుకు వస్తున్నాను, ప్రతి పైసా కూడా ప్రజా సంక్షేమానికి ఖర్చు పెడతాను, ఒక్క రూపాయి కూడా ఆశించాల్సిన అవసరం నాకు లేదు. నేను రైతు బిడ్డను మా నాన్న ఇచ్చిన పొలాన్ని సాగు చేసుకొని కష్టపడతాను, కాని మోసం చేయను, మోసం అనేది నాకు తెలియదు, మోసగాళ్లు వస్తారు, మాయమాటలు చెబుతారు, బెదిరిస్తారు, అలాంటి మాయమాటలను నమ్మకండి అని వైరా మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు సిపిఎం, సిపిఐ బలపరిచిన బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి దొంతెబోయిన వెంకటేశ్వర్లు అన్నారు. దొంతెబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పది సంవత్సరాలు బిఆర్ఎస్ పాలనలోనే వార్డులో రోడ్ల నిర్మాణం జరిగిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండున్నర సంవత్సరాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ఒక్క రోడ్డు కూడా సోమవరంలో వేయలేదని ఆయన అన్నారు. అధికార పార్టీ పేరుతో భయభ్రాంతులకు గురి చేస్తారు, భయపడాల్సిన అవసరం లేదన్నారు, అధికారం లేకోయినా అభివృద్ధి చేసి దమ్ము నాలో ఉంది. చేసి చూపిస్తాను, వార్డులో అవసరమైతే నా సొంత డబ్బులు పెట్టి అభివృద్ధి పనులు చేస్తానని, ఒకరికి భయపడనని మీరు భయపడాల్సిన అవసరం లేదన్నారు. నాకు తెలిసింది రెండే ఒకటి నమ్మకం, రెండు సేవ చేయడం, ఈ రెండు గుణాలు నాకు పుట్టుక నుంచే అలవడ్డాయి, నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నాను అంటే నా కష్టం మా తల్లిదండ్రులు ఇచ్చిన భూమిని సాగు చేసుకోవడం, పంటను పండించడం, చేతనైన వ్యాపారం ఏయడమే నాకు తెలుసు అన్నారు. ఏ రోజు కూడా మోసం చేయడం నాకు తెలియదని ఆయన అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు ఓటర్ ప్రజలు ఒక్కసారి ఆలోచించండి, అభివృద్ధి చేసి చూపిస్తాను, ఏ రోజు నేను ప్రత్యక్షంగా రాజకీయాల్లో ఎక్కడ పోటీ చేయలేదు, తొలిసారి సంక్షేమం మీ కోసం మీ అభివృద్ధి కోసం మీ ముందుకు వస్తున్నాను. ఆశీర్వదించండి, ఆలోచించండి కారు గుర్తుకు ఓటు వేసి నన్ను గెలిపించండి అని దొంతెబోయిన వెంకటేశ్వర్లు ప్రజలను కోరారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం, విబిజి రాంజీ, విత్తన బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటియుసి జాతీయ సమితి సభ్యులు బిజి క్లెమెంట్ కోరారు. ఖమ్మం నగరంలో సోమవారం మున్సిపల్ అడ్డా, సిండికేట్ హమాలీ, ఆటో, గ్రానైట్ కార్మికుల అడ్డాలలో సమ్మె జయప్రదం కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లెమెంట్ మాట్లాడుతూ ఎల్ఐసిలో వంద శాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం ద్వారా మోడీ సర్కార్ ప్రైవేటీకరణకు తలుపులు బార్లా తెరిచిందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లతో దేశంలో కార్మిక సంఘాలను లేకుండా చేయాలని తద్వారా కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చాలని బిజెపి ప్రయత్నిస్తుందన్నారు. 40 కోట్ల మంది కార్మికులపై లేబర్ కోడ్‌లు ప్రభావం చూపుతున్నాయని వీటి ద్వారా కార్మిక కుటుంబాలు చితికిపోయే ప్రమాదం ఉందన్నారు. కార్మిక చట్టాలను మోడీ సర్కార్ హరించి వేస్తుందని దీనికి నిరసనగా ఈనెల 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, హమాలీ యూనియన్ నాయకులు కోదుమూరు బిక్షం, గరిడేపల్లి వెంకన్న, ఎ. సైదులు, సిహెచ్ సీతారాములు, హమాలీ యూనియన్ నాయకులు నూకల శ్రీను, రవీందర్‌రెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నకిరికంటి కృష్ణ, బాబురావు, ముత్తయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

**-వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మున్సిపల్ ఎన్నికలపై సోమ వారం రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ డా।। పి. శ్రీజ, సాధారణ ఎన్నికల పరిశీలకులు పవన్‌కుమార్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా పరిధిలో ఐదు మున్సిపాలిటీలలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎన్నికల పరిశీలకుల సమక్షంలో మూడవ ర్యాండమైజేషన్ పూర్తి చేసి పోలింగ్ బృందాలన ఫైనల్ చేశామని, అవసరమైన శిక్షణను అందించామని తెలిపారు. ప్రతి మున్సిపాలిటీ పరిధిలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అక్కడ అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. లెక్కింపు సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ కూడా పూర్తయినట్లు, లెక్కింపు సిబ్బందికి శిక్షణ కూడా అందించామని, కౌంటింగ్ హాల్స్ నందు అవసరమైన ఏర్పాట్లు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. వంద శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి మున్సిపాలిటికి ఒక ఇంచార్జి అధికారిని ఎన్నికల నిర్వహణ కోసం కేటాయించామన్నారు. పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ముజాహీద్, అధికారులు పాల్గొన్నారు.

# ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే మెరుగైన జీవనం

**-స్వస్త్ మహిళ స్వస్త్ భారత్ కార్యక్రమంలో కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రారంభ దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే చికిత్సను విజయవంతంగా పూర్తి చేసుకుని మెరుగైన జీవనం పొందవచ్చునని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో యువికెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్వస్త్ మహిళ స్వస్త్ భారత్ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్లు డా।।పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించడం చాలా కీలకమన్నారు. ప్రాథమిక దశ దాటితో ఆరోగ్య పరిస్థితి విషమం అవుతుందన్నారు. కలెక్టరేట్‌లో 30 ఏళ్లకు పైగా వయస్సున్న మహిళా అధికారులు, ఉద్యోగులకు బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ చేసేందుకు క్యాంపు ఏర్పాటు చేయాలని డిఎంఅండ్‌హెచ్‌వోకు కలెక్టర్ సూచించారు. క్యాన్సర్‌ను లేటుగా గుర్తించి చికిత్స పొంది మనం బతికినప్పటికి మన లైఫ్ స్టైల్‌లో చాలా ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణ, యంత్రాలను అందించిన యువికెన్ ఫౌండేషన్‌కు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ యంత్రాల ద్వారా ఆరోగ్య మహిళా శిబిరాలలో మహిళలను స్క్రీన్ చేసి అనుమానితులుగా ఉన్న వారికి అవసరమైన నిర్ధారణ పరీక్షలు నిర్వహించి క్యాన్సర్ వ్యాధిని గుర్తించిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. యువికెన్ ఫౌండేషన్ రీజినల్ మేనేజర్ డా।। షహనాజ్ భాను మాట్లాడుతూ స్వస్త్ మహిళ స్వస్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఏడాదిన్నర నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలలో యువికెన్ ఫౌండేషన్ తరుపున క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని నాలుగు పిహెచ్‌సిల పరిధిలో 14వేల మంది మహిళలకు స్క్రీన్ చేసి 200 మంది అనుమానితులకు నిర్ధారణ పరీక్షలు చేస్తే ఇద్దరికి బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణ జరిగిందన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్ చెక్ చేసే యంత్రాన్ని నేడు జిల్లా యంత్రాంగానికి అప్పగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పి సిఈవో దీక్షారైనా, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో డా।। చందునాయక్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.